అస్తిత్వ వేదికలు
ఆత్మగౌరవ భవనాలు

సూర్యాపేట జిల్లాలో కుల, ఉద్యోగ, కార్మిక సంఘాలకు భవనాలు

ఎన్నో ఏండ్ల కలకు రూపమిచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డి
ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన పలు కుల సంఘాల భవన్‌లు
ఇటీవల మరో 19 భవనాలకు శంకుస్థాపన
మంత్రి వెంటే ఉంటామంటున్న కుల సంఘాల నాయకులు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో అందుబాటులోకి వచ్చిన విప్రహిత బ్రాహ్మణ సదన్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 12 : సమాజంలోని ప్రతి కులానికీ ఒక భవనం ఉండాలని, అది వారి ఆత్మగౌరవాన్ని నిలిపేలా ఉండాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం. ఆయన ఆలోచనలను అమలు చేస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి 19 కుల సంఘాలకు స్థలాలను కేటాయించి ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలకు నాంది పలికారు. గత ప్రభుత్వాల్లో ఆయా కులాల నాయకులు ప్రధానంగా పని చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. స్వరాష్ట్రంలో కుల, మతాలకు అతీతంగా అడిగిందే తడవుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయా కులాల ఆత్మగౌరవాన్ని నిలిపేలా కుల సంఘాల భవనాల నిర్మాణానికి అంకురార్పణ చేసింది. ఇప్పటికే సూర్యాపేట జిల్లా కేంద్రంలో బ్రాహ్మణులకు ఎకరం స్థలంలో రూ.2కోట్లతో బ్రహ్మణ సదన్, కుమ్మరులకు శాలివాహనం భవనం, ఎరుకులకు 14గుంటల్లో రూ.75లక్షలతో నిర్మించిన ఏకలవ్య భవన్ అందుబాటులోకి వచ్చాయి. అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇవే కాకుండా మొత్తం 19 కుల, ఉద్యోగ, కార్మిక సంఘాల భవనాలకు మంత్రి జగదీశ్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు.

పట్టించుకోని గత ప్రభుత్వాలు

గత ప్రభుత్వాల్లో కుల, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు తమ సంఘాల కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు స్థలాలు మంజూరు చేయించి భవనాలకు నిధులు కేటాయించాలని తిరుగని రోజు లేదు. ఆయా పార్టీల్లో పని చేసే నాయకులపై కుల సంఘాలు ఎంత ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకుండా పోయింది. తమ పార్టీలోని ప్రజాప్రతినిధులకు విన్నవించలేక, ఇటు కుల సంఘాల్లో పెద్దలకు సమాధానం చెప్పలేక ఆయా కులాల నాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి అన్ని కులాలు, సంఘాలకు స్థలాలు కేటాయించి భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో ఆయా కులాల్లో ఆనందం నెలకొంది. తాము అడక్కుండానే సంఘం కార్యకలాపాలకు భవనాలు కేటాయించిన మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటే ఉంటామని కుల సంఘాల నాయకులు ముక్త కంఠంతో చెబుతున్నారు.

సూర్యాపేట పట్టణంలోని 7వ వార్డులో నిర్మించిన ఏకలవ్య భవనం

కుల సంఘాల భవనాలకు స్థలం, నిధులు కేటాయింపు

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయా కుల సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించడంతోపాటు నిధులు మంజూరు చేసింది. పెరిక భవన్‌కు ఎకరం స్థలంతోపాటు నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశారు. వైశ్య భవన్‌కు, గౌడ, రెడ్డి భవనాలకు ఎకరం భూమి, రూ.2కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. పీఆర్‌టీయూ భవన్ నిర్మాణానికి రూ.50లక్షలు, ముదిరాజ్ భవన్‌కు 18గుంటల భూమి కోటి రూపాయలు కేటాయించారు. ఎల్‌ఐసీ ఏజెన్సీ భవన్‌కు 12గుంటల భూమి, నిర్మాణానికి రూ.50లక్షలు, మేరు భవన్‌కు 14గుంటల భూమి, రూ.25లక్షలు, మాల కమ్యూనిటీ భవన్‌కు 20గుంటల భూమి, కోటి రూపాయలు, ఆటో యూనియన్ భవన్‌కు 29గుంటల స్థలం, కోటి రూపాయలు, మున్నూరు కాపు భవనానికి 19గుంటల స్థలం, రూ.2కోట్లు, దూదేకుల భవన్‌కు 14గుంటల భూమి, రూ.50లక్షలు, బైక్ మెకానిక్‌ల యూనియన్ భవనానికి 14గుంటల భూమి, రూ.50లక్షలు, సిక్కు భవన్‌కు 12గుంటల భూమి, రూ.25లక్షలు, స్వర్ణకారు భవన్‌కు 12గుంటల భూమి, రూ.25లక్షలు, మోచి భవన్‌కు 8గుంటల భూమి, రూ.25లక్షలు, భవన నిర్మాణ కార్మిక భవన్‌కు రెండెకరాల భూమి, రూ.3.50కోట్లు, క్రిస్టియన్ భవన్‌కు ఎకరం భూమి, 2కోట్ల రూపాయలు కేటాయించారు.

సంఘంలో తలెత్తుకునేలా చేశారు

సూర్యాపేట జిల్లాలో మా కులాన్ని గుర్తించి పెద్ద పీట వేసిన ఘనత మంత్రి జగదీశ్‌రెడ్డికే దక్కుతుంది. మా కులానికి కోదాడలో భవనం ఉన్నప్పటికీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో లేకుండాపోయింది. ఇదే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఎకరం స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణానికి నిధులు ఇచ్చారు. ఈ భవనం విషయంలో గతంలో ప్రతి సమావేశంలో కులస్తుల ముందు తల దించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు గర్వంగా తలెత్తుకుంటున్నా.

– సముద్రాల రాంబాబు, పెరిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట

గతంలో ఎరుకలను చిన్న చూపు చూశారు

గత పాలకులు ఎరుకలను చిన్న చూపు చూశారు. మా కులాన్ని పట్టించుకున్న వారే లేరు. ఇక భవనం సంగతి దేవుడెరుగు. తెలంగాణ రాష్ట్రంలో ఎరుకలకు పెద్దపీట వేశారు. మా కులానికి భవనం కావాలని మంత్రి జగదీశ్‌రెడ్డిని అడగ్గానే 14గుంటల భూమిని ఇచ్చారు. రూ.75లక్షలతో భవనాన్ని నిర్మించారు. అందుబాటులోకి వచ్చిన ఎరుకల భవన్ మా కులస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మమ్మల్ని మనుషులుగా గుర్తించి భవనం నిర్మించి ఇచ్చిన మంత్రి జగదీశ్‌రెడ్డి మాకు దేవుడితో సమానం. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం.

– కుంభం రాజేందర్, ఎరుకలి సంఘం పట్టణ అధ్యక్షుడు, సూర్యాపేట

భవన నిర్మాణ కార్మిక భవన్‌కు రెండెకరాలు ఇవ్వడం సంతోషకరం

ఎన్నో ఏండ్లుగా మా కార్మిక సంఘాలకు భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. గత ప్రభుత్వాల్లోని ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మంత్రి జగదీశ్‌రెడ్డిని అడిగిన వెంటనే భానుపురి భవన నిర్మాణ కార్మిక భవన్‌కు రెండెకరాల భూమి కేటాయించి నిధులు మంజూరు చేయడం సంతోషకరం. ఈ భవనం మాకు ఎంతో ఉపకరిస్తుంది. మంత్రి జగదీశ్‌రెడ్డికి రుణపడి ఉంటాం. కార్మికులమంతా ఆయన వెంటే నడుస్తాం.

– బొమ్మగాని వెంకన్న, భానుపురి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు, సూర్యాపేట

దీర్ఘకాలిక రోగులకు స్వాంతన

జిల్లా కేంద్రంలో అందుబాటులోకి పాలియేటివ్ కేర్ సెంటర్
క్యాన్సర్, తదితర వ్యాధిగ్రస్తులకు అందుతున్న వైద్య సేవలు
అక్యూట్ మెడికల్ కేర్ వారికి ఇంటి వద్దే చికిత్స

రోగుల ఇంటి వద్దకు వెళ్లి ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్య సిబ్బంది

నీలగిరి, అక్టోబర్ 12 : నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు.. అన్న నానుడి నుంచి స్వరాష్ట్రంలో క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులకు సైతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స అందుతున్నది. చిన్న రోగం వచ్చినా పట్నం పోయే స్థితి నుంచి జిల్లా కేంద్రంలోనే వైద్యసేవలు ఒక్కొక్కటిగా ప్రజలకు చేరువవుతున్నాయి. నల్లగొండలోని జిల్లా ఆసుపత్రి 400 పడకల నుంచి జనరల్ దవాఖానగా అప్‌గ్రేడ్ అయ్యాక అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉపశమనం కల్పించేందుకు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో గత సంవత్సరం ఏప్రిల్‌లో పాలియేటివ్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ఎప్పటికీ నయం కాని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వ్యాధి లక్షణాలను తగ్గిస్తూ నొప్పి నుంచి విముక్తి కలిగించేందుకు చికిత్స అందిస్తున్నారు. తద్వారా రోగుల జీవిత కాలాన్ని పెంచడంతోపాటు చివరి వరకు రోగులకు వ్యాధి లక్షణాలతో కలిగే బాధ నుంచి విముక్తి కలిగిస్తారు.

దీర్ఘకాలిక రోగాల బారిన పడి అనేక ఇబ్బందులకు గురవుతున్న బాధితులకు జిల్లా కేంద్రంలోని పాలియేటివ్ కేర్ సెంటర్ అండగా నిలుస్తున్నది. ఆసుపత్రికి వచ్చిన వారికి భరోసా కల్పిస్తూనే మంచంపై ఉన్న వారి ఇంటికే వెళ్లి వైద్యసేవలు అందిస్తూ వారికి స్వాంతన చేకూర్చుతున్నది. జాతీయ ఆరోగ్య మిషన్, వైద్యారోగ్య శాఖ కమిషనర్ పర్యవేక్షణలో ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ పాలియేటివ్ కేర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల సిబ్బంది సహయంతో వైద్యురాలు, ఫిజియోథెరపిస్ట్, సిబ్బంది గ్రామాలను సందర్శించి రోగులకు వైద్యసేవలు, మందులు అందిస్తున్నారు. రోగుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు.

ఇంటి వద్దే వైద్య సేవలు..

జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని వైద్యాధికారుల లెక్కలు చెప్తున్నాయి. ప్రధానంగా మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరుగుతుండగా, క్లోమ గ్రంధి క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటున్నది. వీరంతా జీవిత కాలంపాటు చికిత్స పొందాల్సి ఉండగా.. వ్యాధి వల్ల తరచూ తీవ్రమైన నొప్పి వస్తుంది. ఇటువంటి బాధితులకు జనరల్ ఆసుపత్రిలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో నొప్పి నుంచి విముక్తి కల్పిస్తున్నారు. ప్రధానంగా డయాబెటిస్, క్లోమ గ్రంధి, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి అక్యూట్ మైనిటైటీస్ పరిస్థితులు ఉన్న వారికి బాధ నుంచి స్వాంతన కలిగించేందుకు ఫ్లుయిడ్ టాపింగ్ సింప్టమేటివ్ ట్రీట్‌మెంట్ చికిత్స అందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచం నుంచి దిగలేని పరిస్థితిలో ఉన్నవారికి సైతం ఆలన కార్యక్రమం ద్వారా ఒక రోజు రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లోని రోగులకు సైతం ఇంటి వద్దే వైద్యసేవలు అందుతున్నాయి. అయితే.. చాలా మందికి క్యాన్సర్‌పై అపోహలు ఉన్నాయని, అది అంటు వ్యాధి కాదని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉంటే రోగులను వాహనంలో పాలియేటివ్ కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలో 1200 దీర్ఘకాలిక రోగులను గుర్తించారు. ఇందులో 960 మందికి పైగా క్యాన్సర్ బాధితులు ఉండగా.. వారందరికీ వైద్య సేవలందిస్తున్నారు. పాలియేటివ్ కేంద్రంలో ఒక డాక్టర్, ఫిజియోథెరపిస్ట్, నలుగురు స్టాఫ్ నర్సులు, ముగ్గురు ఆయాలు, వాహనం, డ్రైవర్‌ను అందుబాటులో ఉంచారు. జిల్లా కేంద్రంలో 8 పడకలతో వార్డు ఫిజియోథెరపీ పరికరాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

అలన ద్వారా ఏర్పాటు చేసిన వాహనం

క్యాన్సర్ అంటు వ్యాధి కాదు



జనరల్ ఆసుపత్రిలోని పాలియేటివ్ కేర్ సెంటర్‌లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్స అందిస్తున్నాం. ఆసుపత్రికి వచ్చే వారితోపాటు రోజుకో గ్రామాన్ని సందర్శించి రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలందించడంతోపాటు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. క్యాన్సర్ వ్యాధిపై చాలా మందిలో అపోహలు ఉన్నట్లు గుర్తించాం. క్యాన్సర్ అంటు వ్యాధి కాదు. ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సేవలు కూడా అందిస్తాం. ఈ వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తే ఇతరులకు సోకదు. దీనిపై జిల్లాలో విస్తృత ప్రచారం చేస్తున్నాం.

– డాక్టర్ ఎడ్ల మౌనిక, పాలియేటివ్ కేర్ సెంటర్ మెడికల్ ఆఫీసర్, నల్లగొండ

పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం సీ-విజిల్

ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుకు అవకాశం
తాజాగా యాప్ ఆధునీకరణ, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం
100 నిమిషాల వ్యవధిలోనే దర్యాప్తు.. ఫిర్యాదుదారుడికి సమాచారం

నీలగిరి, అక్టోబర్ 12 : ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్‌ను ఆధునీకరించడంతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో అనుసంధానం చేశారు. అక్రమాలకు సంబంధించిన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల వ్యవధిలోనే దర్యాప్తు చేసి ఫిర్యాదుదారుడికి తెలియజేస్తారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితోపాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది.

ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకుల అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై సామాన్య పౌరులు సైతం నేరుగా ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సీ-విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం ఈ యాప్‌ను ఆధునీకరించి, ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేశారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘించినా, రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లకు డబ్బులు, మద్యం, బహుమతులు పంచినా ఆ వివరాలతో నేరుగా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎన్నికల ప్రచార సమయంలో అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్లు వాడినా, ర్యాలీలు తీసినా, నిబంధనలు ఉల్లంఘించినా, కుల, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ఫిర్యాదు చేసే వెసులుబాటు కల్పించారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండిలా..

స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు ఈ యాప్‌ను గూగుల్, యాపిల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్లే స్టోర్‌కు వెళ్లి సీ-విజిల్ యాప్ అని టైప్ చేయగా.. 8.41 ఎంబీ ఉన్న యాప్ డౌన్‌లోడ్ అవుతుంది. యాప్‌ను ఓపెన్ చేసి భాషను ఎంచుకోవాలి. ఆ తరువాత అక్కడ సూచించే వివిధ నిబంధనలను అంగీకరిస్తున్నట్లుగా టిక్ చేయాలి. అనంతరం సీ-విజిల్ ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా అనే యాప్ సెల్‌ఫోన్ స్క్రీన్‌పై కనబడుతుంది. అనంతరం సెల్‌ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నుంచి ఎస్‌ఎంఎస్ ద్వారా నాలుగు నంబర్ల ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసిన తరువాత వినియోగదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు వినియోగదారుడి అడ్రస్, పిన్‌కోడ్, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం వంటి పూర్తి వివరాలు పొందుపరుచాలి. అనంతరం యాప్ ఓపెన్ అయి ఫొటో, వీడియో, ఆడియో లోగోలు కనిపిస్తాయి. వినియోగదారుడు తన ప్రాంతంలో జరిగిన కోడ్ ఉల్లంఘనలపై ఫొటో లేదా వీడియో, ఆడియో రూపంలో లోగోను బట్టి ఎంచుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ ఫిర్యాదు నేరుగా ఎన్నికల సంఘానికి చేరుతుంది. వారు పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తారు. ఈ యాప్‌లో ఎన్నికల సమయంలో చుట్టుపక్కల జరుగుతున్న కోడ్ ఉల్లంఘనలు పొందుపరుచవచ్చు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన 10 నిమిషాల వ్యవధిలోనే ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల వ్యవధిలో చర్యలు తీసుకుంటారు.

అల్లరి

చెప్పుకోండి

1. 'భువన విజయం' ఎవరి ఆస్థానం?
2. సౌరవ్యవస్థలో ఆస్టరాయిడ్లు ఏయే గ్రహాల మధ్య ఉన్నాయి?
3. ఇత్తడి.. ఏయే లోహాల సమ్మేళనం?

పూరించండి

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

పదసృష్టి



కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Everybody

Ex : Body

పెద్దల మాట



కళ్లకు రెప్పలు ఉన్నట్టే.. పనికి విశ్రాంతి ఉండాలి.

• రవీంద్రనాథ్ ఠాగూర్

జవాబులు

చెప్పుకోండి : 1. శ్రీకృష్ణదేవరాయలు, 2. అంగారకుడు–బృహస్పతి, 3. రాగి, జింక్

ఖాళీలు : EAT, ELBOW

చిన్నచూపు

కథ

ధర్మారం గ్రామంలో ఈశ్వరప్ప అనే పెద్ద రైతు ఉండేవాడు. తన భూమిలో మంచి దిగుబడిని ఇచ్చే పంటను పండించేవాడు. గ్రామంలో తెలివైన రైతుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. దాంతో అతనిలో గర్వం పెరిగిపోయింది. తనకంటే ఎక్కువ దిగుబడి సాధించడం ఎవరితరమూ కాదని ప్రగల్భాలు పలికేవాడు. మిగతా రైతులను చిన్నచూపు చూసేవాడు. అంతేకాదు, తోటి రైతులు ఎవరైనా సహాయం కోసం తన దగ్గరికి వస్తే.. వారిని సూటిపోటి మాటలతో బాధించేవాడు. అంతేకాకుండా చెరువు నుంచి వచ్చే నీటిని ఇతరుల పొలాల్లోకి వెళ్లకుండా చేసేవాడు. ఇలా ఉండగా.. ఈశ్వరప్ప ఒకరోజు అర్ధరాత్రి తన పొలం దగ్గర కాపలా ఉన్నాడు. ఆ సమయంలో అతణ్ని ఓ తాచుపాము కాటేసింది. కాసేపట్లోనే నోటి నుంచి నురుగలు కక్కుకుంటూ కిందపడిపోయాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పక్కపొలం రైతు జరిగినదంతా గమనించాడు. కేకవేసి ఇంకొంతమంది రైతులను పిలిచాడు. అంతా కలిసి హుటాహుటిన ఈశ్వరప్పను దగ్గర్లోని దవాఖానకు తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స అందించారు. సరైన సమయంలో తీసుకొచ్చారనీ, ప్రాణాపాయం ఏమీ లేదని చెప్పారు. స్పృహలోకి వచ్చిన ఈశ్వరప్ప.. తనను కాపాడిన రైతులకు కృతజ్ఞతలు చెప్పాడు. ''మీరు చిన్నరైతులని మిమ్మల్ని ఈసడించుకున్నాను. అవేవీ మనసులో పెట్టుకోకుండా నాకు ప్రాణభిక్ష పెట్టారు. ఈ మేలు ఎప్పటికీ మరువలేను!'' అంటూ వారికి చేతులెత్తి నమస్కరించాడు. అప్పటి నుంచి ఈశ్వరప్ప ఊరివాళ్లందరితో కలిసి మెలిసి ఉండసాగాడు. వ్యవసాయంలో రైతులకు తగిన సలహాలు ఇవ్వసాగాడు.

నీతి : ఎంత గొప్పవారు అయినా.. గర్వం పనికిరాదు.

• యాడవరం చంద్రకాంత్ గౌడ్



జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం. మా చిరునామా: zindagi@ntnews.com

రైమ్ టైమ్

Hot cross buns!
Hot cross buns!
One a penny,
two a penny.
Hot cross buns!
If you have no
daughters,
Give them to
your sons!
One a penny,
two a penny.
Hot cross buns!

టంగ్ ట్విస్టర్స్

Cooks cook cupcakes quickly.